## బెంగళూరు ట్రా'ఫికర్'



కర్ణాటక రాజధాని బెంగళూరులో ట్రాఫిక్ సమస్య మరోసారి వార్తల్లోకి ఎక్కింది. సాధారణంగానే నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. బుధవారం క్రిస్మస్ సందర్భంగా ప్రజలంతా బయటకు రావడంతో ట్రాఫిక్ రెట్టింపు అయ్యింది. ముఖ్యంగా మాల్స్ వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాదారులు చివరకు రోడ్డు పక్కనే వాహనాలను నిలిపేసి కిలోమీటర్ల మేర నడుచుకుంటూ గమ్యస్థానాలకు చేరాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## పాక్ సరిహద్దులవైపు 15 వేల మంది తాలిబన్ ఫైటర్లు!

ఇస్లామాబాద్: 'మీ పెరట్లో పాములను పెంచుతూ, పొరుగువారిని మాత్రమే అవి కాటేయాలని ఎంతమాత్రం ఆశించకండి. ఎందుకంటే వాటికి పాలుపోసి పెంచుతున్న మిమ్మల్ని కూడా ఆ సర్పాలు అంతిమంగా కాటేస్తాయి' అని పాకిస్థాన్‌ను ఉద్దేశించి 2011లో అప్పటి యూఎస్ సెక్రటరీ హిల్లరీ క్లింటన్ వ్యాఖ్యానించారు. ఆమె వ్యాఖ్యలను నిజం చేస్తూ ఇన్నాళ్లు తాము పెంచి పోషించిన అఫ్గానిస్థాన్ తాలిబన్లు ఇప్పుడు పాకిస్థాన్‌పై దండెత్తి వస్తున్నారు. సుమారు 15 వేల మంది తాలిబన్ ఫైటర్లు పాకిస్థాన్ సరిహద్దుల వైపు కదులుతున్నట్టు వార్తాకథనాలు వెలువడుతున్నాయి. పాకిస్థాన్ వైమానిక దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని తాలిబన్లు హెచ్చరించారు. దీంతో పాక్‌కు తాలిబన్ల నుంచి ముప్పు పొంచి ఉంది.

## హెచ్1బీ పరిమితి తొలగింపు?

- డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ముందు ప్రతిపాదన
- పరిమితి తొలగిస్తే పెరగనున్న హెచ్1బీ వీసాలు
- భారతీయ నిపుణులకు తప్పనున్న ఎదురుచూపులు

వాషింగ్టన్, డిసెంబర్ 26: విదేశీ నిపుణులు అమెరికా ఉద్యోగం చేసేందుకు అవకాశం కల్పించే హెచ్1బీ వీసాలపై అమెరికా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తున్నది. ఈ వీసాలపై ఇప్పటివరకు ఉన్న కంట్రీ క్యాప్‌ను తొలగించే అవకాశాలు ఉన్నాయి. ట్రంప్ అధ్యక్షుడైన తర్వాత ఇమిగ్రేషన్ విధానాలు కఠినతరం అవుతాయని, అమెరికా వీసాలు దక్కడం మరింత కష్టమవుతుందనే అంచనాలకు భిన్నంగా ఈ నిర్ణయం ఉండే అవకాశం ఉంది.

**కంట్రీ క్యాప్ తొలగిస్తే..**

ఏదైనా రంగంలో నిపుణులైన ఇతర దేశాల వారు అమెరికాలోని కంపెనీల్లో ఆరేండ్ల పాటు పని చేసుకునేందుకు వీలుగా హెచ్1బీ వీసాలు ఇస్తారు. అయితే, ఈ వీసాలపై పరిమితి ఉంది. మొత్తం వీసాల్లో 7 శాతానికి మించి ఏ దేశానికి ఇవ్వొద్దని అమెరికా గతంలో 'కంట్రీ క్యాప్' విధించింది. దీంతో హెచ్1బీ వీసాలకు ఎక్కువగా పోటీ పడే దేశాల వారు ఏండ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తున్నది. జనాభా, పోటీ తక్కువగా ఉండే దేశాల వారికి ఎలాంటి వెయిటింగ్ లేకుండా వేగంగా ఈ వీసాలు వస్తున్నాయి. ఇప్పుడు కంట్రీ క్యాప్ తొలగిస్తే.. దేశంతో సంబంధం లేకుండా హెచ్1బీ వీసాలు జారీ అవుతాయి. పోటీ ఎక్కువగా ఉన్న దేశస్థులకు ఎక్కువ హెచ్1బీ వీసాలు దక్కుతాయి.

**భారతీయులకు ఎక్కువ మేలు**

హెచ్1బీ వీసాలపై పరిమితి తొలగిస్తే భారతీయ నిపుణులకు ఎక్కువ మేలు జరగనుంది. టెక్నాలజీ, ఐటీ, ఇంజినీరింగ్, ఆరోగ్య రంగాల నిపుణులకు అమెరికా ఎక్కువగా ఈ వీసాలు ఇస్తుంది. టెక్, ఐటీ, ఇంజినీరింగ్ నిపుణుల సంఖ్య భారత్‌లో ఎక్కువ.

**భారత అమెరికన్ శ్రీరామ్ కృష్ణన్ ప్రతిపాదన**

హెచ్1బీ వీసాలపై కంట్రీ క్యాప్‌ను తొలగించాలనే ప్రతిపాదనను భారత అమెరికన్ శ్రీరామ్ కృష్ణన్ తెరపైకి తెచ్చారని తెలుస్తున్నది. ట్రంప్ గెలిచాక ఆయనను కీలకమైన సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యాలయంలో ఏఐ పాలసీ సలహాదారుగా నియమించారు. ఇమిగ్రేషన్ విధానంలో ప్రతిభకు పెద్దపీట వేయాలని, ప్రతిభ ఆధారంగా వీసాల కేటాయింపు ఉండాలని ఆయన సూచించారు.



## రష్యా క్షిపణి వల్లే విమానం కూలిందా?

### కజకిస్థాన్ దుర్ఘటనపై అనుమానాలు

మాస్కో: అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ విమానం నైరుతి కజకిస్థాన్‌లో బుధవారం కూలిపోవడానికి కారణం రష్యా క్షిపణి అయి ఉండవచ్చునని బ్రిటన్‌లోని స్వతంత్ర సంస్థ ఓస్ప్రే ఫ్లైట్ సొల్యూషన్స్ చెప్పింది. ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించిన క్షిపణి కారణంగానే ఈ విమానం కూలిపోయి ఉండవచ్చునని తెలిపింది. ఈ సంస్థ చీఫ్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ మట్ బోరీ మాట్లాడుతూ, ఈ విమానం శిథిలాలకు సంబంధించిన వీడియోను పరిశీలించినపుడు విధ్వంసక చర్య జరిగినట్లు సంకేతాలు వస్తున్నాయన్నారు. రష్యాలోని స్వతంత్ర మీడియా సంస్థ మెడుజ కూడా ఇదే అనుమానం వ్యక్తం చేసింది. ఉపరితలం నుంచి ప్రయోగించిన క్షిపణి ప్రభావం ఈ విమానం తోక భాగంపై పడినట్లు కనిపిస్తున్నదని పేర్కొంది.

## 86% మంది డిపాజిట్లు గల్లంతు!

- లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం అభ్యర్థులు 8,360 మంది
- జాతీయ పార్టీలకు 63% ఓట్లు
- ఓటింగ్‌లో మహిళలదే పైచేయి
- లోక్‌సభ పోలింగ్ వివరాలను వెల్లడించిన ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: 2024లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసిన 8,360 మంది అభ్యర్థుల్లో 7,190 మంది తమ డిపాజిట్లను కోల్పోయారు. అంటే 86 శాతం మందికి తగినన్ని ఓట్లు లభించలేదన్న మాట. వీరిలో 584 మంది ఆరు గుర్తింపు పొందిన పార్టీలకు చెందినవారు, 68 మంది గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీల అభ్యర్థులు, 2,633 మంది రిజిస్టర్ అయి, గుర్తింపు పొందని రాజకీయ పార్టీలకు చెందినవారు. కాగా స్వతంత్ర అభ్యర్థులు 3,095 మంది. వీరిలో ఏడుగురు మాత్రమే విజయం సాధించారు. లోక్ సభ ఎన్నికలకు సంబంధించిన వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం వెల్లడించింది.

**6 జాతీయ పార్టీలకు 63 శాతం ఓట్లు**

2024లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో చెల్లుబాటైన ఓట్లలో 63 శాతం ఓట్లు 6 జాతీయ పార్టీలకు లభించాయి. ఈ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఎం, ఆప్, ఎన్‌పీపీ. ఈ పార్టీలతో పాటు గుర్తింపుపొందిన 47 రాష్ట్ర ప్రాంతీయ పార్టీలు, 690 నమోదైన, గుర్తింపు పొందని పార్టీలు ఈ ఎన్నికల్లో పోటీ చేశాయి. 3,921 మంది స్వతంత్రులు పోటీ చేయగా, ఏడుగురు గెలిచారు. నోటా మీటకు 63,71,839 (అంటే,0.99 శాతం) ఓట్లు లభించాయి. దీనికి 2019లో 1.06 శాతం ఓట్లు వచ్చాయి.

**97.97 కోట్లు**
దేశంలోని మొత్తం ఓటర్లు
**64.64 కోట్లు**
ఓటింగ్‌లో పాల్గొన్నవారు
**65.78%** మహిళలు
**65.55%** పురుషులు
ఈవీఎం ద్వారా ఓటు వేసిన వారు: **64,21,39,275**
పోస్టల్ బ్యాలట్ ఆప్షన్‌ను వినియోగించుకున్నారు:
**సుమారు 43 లక్షల మంది**


